మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శనివారం 11 ఏప్రిల్ 2026
పేజీలు : 4

## మైనర్ల డ్రైవింగ్ నియంత్రణ

- నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల స్వాధీనం
- తల్లిదండ్రులకు పోలీసుల హెచ్చరిక


వివరాలు 2లో..

గుంటూరు జిల్లాలో మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాలు స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుంటూరు రక్షణ న్యూస్



వివరాలు 2లో..

## చెరుకూరు గోల్మాల్‌పై అధికారుల కదలిక...

- రికార్డులు పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి
- పంచాయతీ కార్యాలయం నుంచి కొన్ని రికార్డులు స్వాధీనం
- ఫిర్యాదుదారులను విచారణకు పిలవకపోవడంపై ప్రశ్నలు
- రక్షణ దినపత్రిక కథనాలతో వ్యవహారం వెలుగులోకి


పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీలో నిధుల గోల్మాల్, రికార్డుల మాయం వంటి ఆరోపణలపై అధికారుల్లో కదలిక ప్రారంభమైంది. గత కొద్దిరోజులుగా వెలుగులోకి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ శుక్రవారం చెరుకూరు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కొంత సమాచారం అవసరమని పేర్కొంటూ పంచాయతీలో ఉన్న కొన్ని రికార్డులను తన వెంట తీసుకువెళ్లారు. అయితే ఫిర్యాదు దారులను విచారణకు పిలవకపోవడం గ్రామస్తుల్లో అనేక సందేహాలకు తావిస్తోంది.

బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో

- చెరుకూరు ఆరోపణల జాబితా
- పంచాయతీ నిధుల గోల్మాల్ ఆరోపణలు
- కీలక రికార్డులు మాయమయ్యాయని అనుమానాలు
- చెరువులో స్మశానాల కబ్జాలు
- ప్రభుత్వ భూముల ఆక్రమణలు
- ఎస్సీ--ఎస్టీ మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవకతవకలు
- మూడు నెలలుగా ఆర్టిఐ పై స్పందన కరువు

**డిపిఓ ఏమన్నారు?**

చెరుకూరు పంచాయతీకి వచ్చి రికార్డులను పరిశీలించానని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తెలిపారు. రికార్డుల వెరిఫికేషన్‌కు రెండు నుంచి మూడు రోజులు పడుతుందని రక్షణ దినపత్రిక ప్రతినిధికి చెప్పారు.


వివరాలు 2లో..

## బాపట్ల జిల్లా అభివృద్ధిపై సీఎం సమీక్ష

- ప్రజాప్రతినిధులతో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చ
- నియోజకవర్గాల పునర్విభజనపై త్వరలో స్పష్టత
- మహిళా రిజర్వేషన్లపై సీఎం ప్రస్తావన
- పథకాల అమలులో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సూచనలు

బాపట్ల జిల్లా ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై కూడా సీఎం ప్రస్తావించినట్లు సమాచారం.

అమరావతి రక్షణ న్యూస్

## గ్యాస్ నిల్వలపై కేసు నమోదు


వివరాలు 2లో..

- విజిలెన్స్ దాడుల్లో సిలిండర్లు స్వాధీనం
- గృహిణుల ఇబ్బందుల మధ్య అక్రమాలు

నరసరావుపేటలో విజిలెన్స్ దాడుల్లో 18 ఎల్పీజీ సిలిండర్లు స్వాధీనం కాగా గ్యాస్ కొరత మధ్య అక్ర మ నిల్వలపై కేసు నమోదు చేశారు అధికారులు.

నరసరావుపేట రక్షణ న్యూస్

## ప్రేమజంట ఆత్మహత్య

- పెళ్లి నిరాకరణతో విషాదం
- కొండవీడు కోటలో కలకలం

పల్నాడు జిల్లా కొండవీడు కోటలో ప్రేమజంట పురుగు మందు తాగి ఆత్మ హత్యా యత్నం చే యగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు.

చిలకలూరిపేట రక్షణ న్యూస్


వివరాలు 2లో..

9- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/11/2026 5:11 AM Page 2



# మైనర్ల డ్రైవింగ్ నియంత్రణ

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లాలో రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తల్లిదండ్రులను హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 842 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని మైనర్లకు మరియు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ప్రమాదాలకు దారితీస్తు ందని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

# ప్రేమజంట ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

**చిలకలూరిపేట రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పరిధిలోని యడ్లపాడు మండలం కొండవీడు కోటలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమించిన యువతికి వేరే వ్యక్తితో వివాహం జరగడంతో మనస్తాపానికి గురైన ప్రేమజంట పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు స్వర్ణభారత్ నగర్‌కు చెందిన రసిక మనికంఠ రాజు (20), అంకమ్మ నగర్‌కు చెందిన యువతి గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్నారు. వారి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో యువతికి ఇటీవల మరో వ్యక్తితో వివాహం జరిపించారు. అయితే వివాహం తర్వాత ఆమె భర్తతో ఉండలేనని చెప్పి గుంటూరుకు తిరిగి వచ్చేసింది.

ఈ నెల 7వ తేదీన ఇద్దరూ కొండవీడు కోటకు వెళ్లి 'స్పైకర్' అనే పురుగుమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మనికంఠ రాజు 8వ తేదీ సాయంత్రం మృతి చెందగా, యువతి పరిస్థితి విషమించి 9వ తేదీన మృతి చెందింది.ఈ సంఘటన పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో చోటుచేసుకోవడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతుల తల్లులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా, యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# చెరుకూరు గోల్మాల్‌పై అధికారుల కదలిక...

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీ గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గత మూడు సంవత్సరాలుగా పంచాయతీ నిధుల వినియోగంలో భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు గ్రామస్తులు వెలుగులోకి తెచ్చారు. నిధుల గోల్మాల్, రికార్డుల మాయం, చెరువులో స్మశానాల కబ్జాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఎస్సీ--ఎస్టీలకు నిర్మించాల్సిన మరుగుదొడ్లను నిర్మించకుండానే నిర్మించినట్లుగా చూపించడం వంటి అనేక అంశాలు గ్రామస్థుల ఫిర్యాదుల్లో ప్రధానంగా ఉన్నాయి.ఈ ఆరోపణలన్నింటినీ గ్రామస్థులు స్వయంగా బయటపెట్టడంతో విషయం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. గత 15 రోజులుగా ఈ అంశాలపై రక్షణ దినపత్రిక వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా స్థాయి అధికారుల దృష్టి చెరుకూరుపై పడింది. దీంతో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ గత వారం జిల్లా పంచాయతీ అధికారిని మరియు సి.ఎస్.ఓలను విచారణ అధికారులుగా నియమించినట్లు ప్రకటించారు.అయితే విచారణ ప్రక్రియ వేగంగా సాగకపోవడంతో రక్షణ దినపత్రిక మళ్లీ ఈ అంశంపై కథనాలు ప్రచురించడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ శుక్రవారం చెరుకూరు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీలో ఉన్న పలు రికార్డులను పరిశీలించి, అవసరమైన కొన్ని రికార్డులను తన వెంట తీసుకువెళ్లినట్లు తెలిపారు.పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ చర్యలు గ్రామంలోనే కాకుండా పర్చూరు నియోజకవర్గం మొత్తం లోనూ చర్చనీయాంశంగా మారాయి. అయితే ఫిర్యాదు చేసిన గ్రామస్తులను విచారణకు పిలవకపోవడం పట్ల అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. "విచారణ అంటే ఇదేనా?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ సుబ్బారావు సహా పలువురు గ్రామస్తులు పంచాయతీ అవకతవకలపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు చేశారు. అలాగే ఒక గ్రామస్తురాలు పంచాయతీపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో దాదాపు ఐదు ఫిర్యాదులు సమర్పించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆమె స్వయంగా ఆర్టీఐ చట్టం కింద కూడా సమాచారాన్ని కోరినప్పటికీ ఇప్పటివరకు ఆమెను విచారణకు పిలవలేదని గ్రామస్తులు పేర్కొం టున్నారు.పంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ వంటి అంశాలపై పారదర్శక విచారణ జరగాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారి తీసుకువెళ్లిన రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలు ఏవీ ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# బాపట్ల జిల్లా అభివృద్ధిపై సీఎం సమీక్ష

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బాపట్ల జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రేపల్లె ఎమ్మెల్యే మరియు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందే విధానంపై ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులకు సూచనలు చేశారు. పథకాల అమలులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు .సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు సమాచారం.అదేవిధంగా మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా సీఎం ప్రస్తావించారు. జిల్లాలో మహిళా నాయకత్వానికి అవకాశం కల్పించే విధంగా కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన సూచించినట్లు తెలిసింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు కూడా ముఖ్యమంత్రి కీలక సూచనలు చేసినట్లు సమాచారం. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది.

# గ్యాస్ నిల్వలపై కేసు నమోదు

**నరసరావుపేట రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా నరసరావుపేటలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఎల్పీజీ సిలిండర్లు బయటపడ్డాయి. శ్రీనివాసనగర్‌లోని ఒక ఇంట్లో 18 ఫుల్ గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి యజమాని గంటా పకీరయ్యపై 6ఏ కేసు నమోదు చేయాలని అధికారులు ఆదేశించారు. రాష్ట్రంలో సాధారణ ప్రజలు, ముఖ్యంగా గృహిణులు వంట గ్యాస్ కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ఈ తరహా అక్రమ నిల్వలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది.విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ, గ్యాస్ సరఫరాలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరానికి మించి నిల్వలు ఉంచడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు.ప్రజలు కూడా ఇలాంటి అక్రమాలను గుర్తిస్తే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి దాడులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు

# సీఎం జిల్లా సమీక్షకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**కలెక్టర్ సాయికాంత్ వర్మ**


**గుంటూరు, రక్షణ న్యూస్**



: ముఖ్యమంత్రి నిర్వహించనున్న జిల్లా సమీక్ష సమావేశానికి సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిర్దిష్ట అంశాలతో కూడిన సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శాఖల వారీగా పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రతిపాదిస్తున్న పనుల వాస్తవ పరిస్థితులు, అవసరాలు, ప్రయోజనాలపై పకడ్బందీగా వివరాలు సమీకరించి నివేదికలు రూపొందించాలన్నారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలో కొండవీటి వాగుపై నిర్మించనున్న హై లెవల్ బ్రిడ్జి సహా వివిధ అభివృద్ధి పనులపై సీఆర్డీఏ అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తి స్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతిపాదిత పనులకు సంబంధించి పూర్తి జస్టిఫికేషన్ వివరాలు, మ్యాపులు, ఫోటోలతో ప్రజెంటేషన్ తయారు చేయాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా సిద్ధం చేసిన ప్రజెంటేషన్ వివరాలను శుక్రవారం సాయంత్రం నాటికి సమర్పించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లా పరిధిలో గుంటూరు ఛానల్, గుంటూరు నల్ల, ఇతర పంట కాలువల అభివృద్ధి పనులపై సాగుభూముల ఆయకట్టు తదితర పూర్తి వివరాలతో ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్‌వో ఏ.గంగరాజు, తెనాలి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, జిల్లా విపత్తుల నిర్వహణ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీకుమారి, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటరత్నం, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగ సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి. వి. సత్యనారాయణ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ, ఆర్‌అండ్‌బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాసమూర్తి, కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ.గాయత్రి దేవి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సాగుతో ఆరోగ్యకర జీవనం

**పల్నాడు, రక్షణ న్యూస్**



ప్రకృతి సాగు విధానంలో న్యూట్రి గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. జిల్లా కేంద్రంలోని గుర్రం జాషువా మీటింగ్ హాల్లో న్యూట్రి గార్డెన్స్, కిచెన్ గార్డెన్స్, సూర్య మండలం, ఏటీఎం (ూాఅం ుఊఎవ వీశీఅవం) మోడల్స్, టెర్రస్ గార్డెన్స్, కమ్యూనిటీ గార్డెన్స్ మరియు బయో రిసోర్స్ సెంటర్లపై శుక్రవారం సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం అందించడం, ప్రతి కుటుంబం స్వయంగా ఆహారాన్ని పండించుకోవడం, రసాయన రహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె. అమలకుమారి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల నేల నాణ్యత దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. చిన్న స్థలంలోనే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు సాగు చేయవచ్చని వివరించారు. సూర్య మండలం మోడల్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, ఏటీఎం మోడల్ ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఇంటి వద్ద పండించిన ఆహారం రసాయన రహితంగా ఉండటం వల్ల కుటుంబ ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అదనపు ఉత్పత్తిని విక్రయించి ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ పాఠశాలలు, అంగనవాడి కేంద్రాలు, కళాశాలలు మరియు స్వయం సహాయక సంఘాల మహిళల వద్ద అందుబాటులో ఉన్న స్థలాన్ని వినియోగించి న్యూట్రి గార్డెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చిన్నపిల్లలకు పోషకాహారం అందించడం అత్యంత అవసరమని, అంగనవాడి కేంద్రాల ద్వారా పోషకాహార భద్రత పెంచాలని తెలిపారు. న్యూట్రి గార్డెన్స్ ప్రోత్సాహం కోసం గ్రామ స్థాయిలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని సూచించారు. శిక్షణలో భాగంగా కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్, టెర్రస్ గార్డెన్ ఏర్పాట్లు, విత్తనాల ఎంపిక, నీటి నిర్వహణ, సేంద్రియ ద్రావణాల తయారీపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ మనోజ్, అమల కుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మెప్మా, డీఆర్‌డీఏ, ఐసిడిఎస్ అధికారులు, డీపీఓలు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడులో జీఎస్టీ సమన్వయ సమావేశం




**నర్సరావుపేట రక్షణ న్యూస్**

జిల్లాలో జీఎస్టీ వసూళ్లను పెంచేందుకు వివిధ శాఖల సమన్వయం అవసరమని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మరియు గుంటూరు జాయింట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులు)-II జాన్ స్టీవెన్సన్ పాత్రో ఆధ్వర్యంలో జీఎస్టీ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీఎస్టీ వసూళ్లను పెంచడంలో వివిధ శాఖలు అందించాల్సిన సహకారం గురించి చర్చించారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని తమ శాఖల ద్వారా అందించగల సహకారంపై వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల అసిస్టెంట్ కమిషనర్లు (రాష్ట్ర పన్నులు) హాజరయ్యారు

## రైల్వే ఆర్వోబీ, ఆర్యూబీలు త్వరగా పూర్తి చేయాలి



**నరసరావుపేట, రక్షణ న్యూస్**

జిల్లాలో భారత రైల్వే శాఖ చేపట్టిన రైల్వే ఆర్వోబీ (రోడ్ ఓవర్ బ్రిడ్జి), ఆర్యూబీ (రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆర్వోబీ, ఆర్యూబీల నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల కోసం తొలగించిన నిర్మాణాలకు సంబంధిత వ్యక్తులకు తగిన పరిహారం చెల్లించాలని సూచించారు. ఆర్వోబీ, ఆర్యూబీ నిర్మాణాల సమయంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పనులు నిర్వహిస్తున్న టెక్నీషియన్ల వివరాలు స్థానికులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కావడం లేదని, ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజనా సింహా, డి.ఆర్.ఓ నారదముని, ఆర్డీవో మురళీకృష్ణ, రైల్వే శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడపై అవగాహన కార్యక్రమం



**గుంటూరు, రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం రావిపాడు గ్రా మంలోని హెల్త్ సబ్ సెంటర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమం సందర్భంగా తల్లి-శిశు పోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్. నందకుమార్ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై వివరించారు. గర్భిణీ పరీక్షలు (టాచీజ) క్రమం తప్పకుండా చేయించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని సూచించారు. అలాగే శిశువుకు సరైన వయస్సులో అనుబంధాహారం ప్రారంభించడం అవసరమని పేర్కొన్నారు. కుటుంబాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.డి. జరీనా, ఏఎన్ఎం ఏ. ప్రభావతి, సిహెచ్ఓ ఏ. దివ్య కుమారి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## పేదల చికిత్సకు సీఎం సహాయనిధి



**పర్చూరు రక్షణ న్యూస్**

పేదల వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫారసుతో ఇద్దరు బాధితులకు ఎల్ఓసద్వారా చెక్కులను అందజేశారు. గంగవరం గ్రామానికి చెందిన బోడెంపూడి రాజ్యలక్ష్మికి అత్యవసర వైద్య చికిత్స కోసం రూ. 2,04,260 విలువైన చెక్‌ను కొణికి పీఏసీఎస్ చైర్మన్ బోడెంపూడి సుబ్బారావు అందజేశారు. అలాగే కడవకుదురు గ్రామానికి చెందిన గడ్డం రమణకు అత్యవసర చికిత్స కోసం రూ. 1,33,180 విలువైన ఎల్ఓసీ చెక్‌ను బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పేదల వైద్య చికిత్సకు ముఖ్య మంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనార్టీలకు టిడిపి భరోసా



**చీరాల రక్షణ న్యూస్**

చీరాల నియోజకవర్గంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ 2026 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ క్యాలెండర్‌ను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీలకు న్యాయం చేయడంలో పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి టౌన్ ముస్లిం మైనారిటీ జనరల్ సెక్రటరీ సయ్యద్ బాషా మాట్లాడుతూ, ఉర్దూ అకాడమీ కార్యక్రమాలు ముస్లిం మైనారిటీల సాంస్కృతిక, విద్యా అభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, ముస్లిం మైనారిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ, ముస్లిం మైనారిటీ వర్గాల నుంచి మంచి స్పందన లభించింది.

# వేసవికి జిఎంసి ప్రత్యేక చర్యలు

**గుంటూరు రక్షణ న్యూస్**



గుంటూరు నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే దిశగా నగర పాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలోని ప్రధాన రహదారులు, రద్దీగా ఉండే కూడళ్లు, ట్రాఫిక్ జంక్షన్లలో వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పిచికారీ చేయిస్తూ దుమ్ము, ధూళి ఎగిసిపడకుండా నియంత్రణ చర్యలు అమలు చేస్తోంది. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో ఈ కార్యక్రమాన్ని రెండు వాహనాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ చర్యల వల్ల వాతావరణం కొంతమేర చల్లబడటంతో పాటు గాలిలో ఉండే దుమ్ము కణాలు తగ్గి గాలి నాణ్యత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు, వాహన రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ స్ప్రింక్లర్ల వినియోగం కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. అదనంగా, ప్రజల సౌకర్యార్థం జనసమ్మర్ద ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు నగర కమిషనర్ తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని సూచించారు.

## వరకట్న వేధింపులకి యువతి బలి

**మంగళగిరి రక్షణ న్యూస్**



గుంటూరు జిల్లా మంగళగిరి పరిధిలోని దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వరకట్న వేధింపులను తట్టుకోలేక ఐదు నెలల గర్భిణి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన బిరుదు తేజ--కళ్యాణి దంపతులు గత సంవత్సరం ఆగస్టులో వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో రూ. 5 లక్షల నగదు, 25 తులాల బంగారం, 5 ఎకరాల పొలం కట్నంగా ఇచ్చినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. పెళ్లి తర్వాత కుటుంబంలో తోడికోడళ్ల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో కళ్యాణి మానసికంగా బాధపడుతున్నట్లు సమాచారం. ఇటీవల తనను వేధిస్తున్నారని ఆమె బంధువులకు ఫోన్ ద్వారా తెలియజేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి కళ్యాణి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పెళ్లయి తొమ్మిది నెలలకే కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈనెల 13న శ్రీమంతం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతుండగానే ఈ ఘటన చోటుచేసుకోవడం గ్రామంలో విషాదాన్ని నింపింది. బాపట్ల జిల్లా అడవులదీవి నుంచి మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వరకట్న వేధింపుల కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డిఎస్పి మురళీకృష్ణ కేసును పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.




## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్లలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మిపురంలోని రోటరీ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ, రోటరీ సంస్థ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. దివ్యాంగులు కూడా ఇతరుల్లా జీవితంలో ముందుకు సాగేందుకు ఈ ట్రైసైకిళ్లు ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. "మేము సైతం" అనే ఆత్మవిశ్వాసంతో జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, మంగళగిరి, పిడుగురాళ్ల లైమ్ సిటీ క్లబ్బుల సహకారంతో నిర్వహించగా, పలువురు సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. స్థానికులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు

## ప్రజా నాయకుడి విగ్రహ ప్రతిష్ట

**బాపట్ల రక్షణ న్యూస్**





బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద స్వర్గీయ కోన ప్రభాకర్ రావు గారి విగ్రహ పునరావిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, మాజీ ఉపసభాపతి కోన రఘుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ, తన తండ్రి కోన ప్రభాకర్ రావు బాపట్ల ప్రజల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానుభావుడని తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా తీసుకుని పేదల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతూ ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బాపట్ల ప్రాంత అభివృద్ధికి కోన ప్రభాకర్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.